
సాక్షి
గుంటూరు
శుక్రవారం । 26 । మే । 2023



నిమ్మకాయల ధరలు

తెనాలి టౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ. 1,300, గరిష్ట ధర రూ. 2500, మోడల్ ధర రూ. 1800 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 520.70 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.70 అడుగుల వద్ద ఉంది.

నాగార్జునకొండకు తెలంగాణ హైకోర్టు జడ్జి



విజయపురిసౌత్: పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఎంజీ ప్రియదర్శిని గురువారం కుటుంబ సమేతంగా సందర్శించారు.

న్యూస్‌రీల్

పటిష్ట బందోబస్తు



తాడికొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాల్ రాజ్ తెలిపారు. సీఎం పర్యటనను పురస్కరించుకొని గురువారం వెంకటపాలెంలో సభ ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల రాకపోకల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, వీవీపీల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సభా వేదిక, ట్రాఫిక్ నియంత్రణ, పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో గుంటూరు ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్, పల్నాడు ఎస్పీ. రవి శంకర్ రెడ్డి, ఎస్పీలు, రవీంద్ర బాబు, విశాల్ గున్నీ, పలువురు ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రతి ఐదు సచివాలయాలకు ఒక ఆధార్ కేంద్రం

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి



నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ప్రతి ఐదు సచివాలయాలకు ఒక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 538 సచివాలయాలకు 107 సచివాలయాలలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్ వద్ద నాల్గో విడత 45 ఆధార్ కేంద్రాల పరికరాలను గురువారం పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తొలి విడతలో 18, రెండో విడతలో 29, మూడో విడతలో 15 ఆధార్ కేంద్రాల పరికరాలను పంపిణీ చేశామన్నారు. జీరో టు ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ కేంద్రాలలో వివరాలను నమోదు చేసి కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని సచివాలయాల పరిధిలో ఆధార్ వివరాల అప్‌డేట్ నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పదేళ్ల కిందట ఆధార్ కార్డులు పొందినవారు, తప్పనిసరిగా వారి కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఆధార్ కార్డును అప్ డేట్ చేసుకోకుంటే, అవి రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు.

దుర్గమ్మ నిత్యాన్నదానానికి విరాళాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపైగల శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ప్రతి రోజూ నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు వివిధ రూపాలలో విరాళాలు అందజేశారు. విజయవాడకు చెందిన భరత్ మద్దినేని, సేవిత కుటుంబ సభ్యులు, విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన నర్రా మల్లేశ్వరరావు, శ్రవణ్ కృష్ణ ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కర్నాటి రాంబాబును కలిసి ఒక్కొక్కరు రూ.1,00,116లను విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదాలు, శేష వస్త్రాన్ని అందజేశారు.

28న విశ్వకర్మ లెజండరీ అవార్డుల ప్రదానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విశ్వకర్మ నేషనల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ తెలిపారు. ఆ రోజు కార్యక్రమంలో విశ్వకర్మ లెజండరీ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వబ్రాహ్మణ పంచకర్మలు, సాహిత్య, సాంస్కృతిక, వేద విద్య, వైదిక ఆగమ శాస్త్రాల్లో నిష్ణాతులైన విశ్వకర్మలకు అవార్డులను అందజేస్తామని పేర్కొన్నారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకుడు విశ్వనాథుల పుష్పగిరి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తేంద్ర పారంపర్య పీఠాధిపతులు, నందికొండ సంస్థానాధీసులు శ్రీకాంతేంద్ర స్వామీజీ అనుగ్రహభాషణ చేస్తారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం మహిళా అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి, మహిళా నాయకురాలు రామోజు మల్లీశ్వరి, కోసూరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

పేద ఇక రా'జాగా' : మంగళగిరి రూరల్ మండలం నిడమర్రులో సిద్ధం చేసిన లేఅవుట్



ఇన్నాళ్లూ ఒత్తులేసుకుని ఎదురుచూసిన కళ్లు వెలుగుదివ్వెలై మెరిసినట్టు.. పేదల మోములు సంతోషంతో కళకళలాడాయి. ఆనందం, ఉద్వేగం కలగలిసి ఉవ్వెత్తున ఎగసినట్టు.. పేదలంతా చెట్ట'పట్టా'లేసుకుని అమరావతి బాటపట్టారు. అంబరాన ఇంద్రధనుస్సు విరిసినట్టు.. ప్రజారాజధాని పండగ కాంతులీనింది. క్యాపిటలిస్టుల కోటలో బీదాబిక్కీ ఉండకూడదన్న దుష్టచతుష్టయం కుట్రలను ఛేదించినట్టు.. రాష్ట్ర నడిబొడ్డున బహుజన పతాక సగర్వంగా రెపరెపలాడింది. వ్యవ'స్థల'పై గెలుపుతో జననేత మాటే 'శాసన'మైనట్టు.. జనగళం జయజయధ్వానాలు చేస్తోంది.

పేదల చెట్ట'పట్టాల్'

- నెరవేరనున్న సొంతింటి కల
- అమరావతిలో 50,793 మందికి ఇళ్ల స్థల పట్టాలు
- నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా పంపిణీ
- శాసన రాజధానిలో పండగ వాతావరణం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గజం స్థలం లేక అద్దె ఇళ్లలో మగ్గుతున్న పేదలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభయమిచ్చారు. విజయవాడ నగరంతోపాటు తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని ప్రాంతాల్లోని అద్దెఇళ్లతోపాటు, చెరువు, కాలవగట్లు, కొండ అంచుల్లో ప్రమాదకర పరిస్థితుల్లో నివసిస్తున్న ఎంతోమందికి శాసన రాజధాని అమరావతిలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. వాటికి సంబంధించిన పట్టాలను శుక్రవారం తుళ్లూరు మండలం వెంకటపాలెంలో పంపిణీ చేయనున్నారు. 50,793 కుటుంబాల్లో వెలుగులు నింపనున్నారు. ఫలితంగా పేదల్లో సంతోషం వ్యక్తమవుతోంది. లబ్ధిదారులు ఇప్పటికే తమకు కేటాయించిన లేఅవుట్లను సందర్శించి తమ ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో చూసుకుని మురిసిపోయారు. గురువారం ప్రతి లేఅవుట్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి సంక్షేమ పాలకా.. వందనం అంటూ నినదించి కృతజ్ఞత చాటారు. ఒకేసారి ఇంతమందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం దేశచరిత్రలోనే తొలిసారి.

సీఎం సభకు భారీగా ఏర్పాట్లు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరగనున్న పట్టాల పంపిణీ కార్యక్రమం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి కావడంతో లబ్ధిదారులకు వారి కుటుంబాలకు ఇబ్బంది లేకుండా వసతులు కల్పిస్తున్నారు. సభకు ప్రజలు భారీగా తరలిరానున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ మళ్లించారు. ఏర్పాట్లను మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు.

సిద్ధమైన లేఅవుట్లు

రాజధాని ప్రాంతంలో పేదల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన లేఅవుట్లు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యాయి. ప్లాట్ల సరిహద్దులు గుర్తించి అధికారులు రాళ్లు పాతారు. నంబరింగ్ ఇచ్చారు. తాత్కాలిక రోడ్లు ఏర్పాటు చేశారు. ఏ ప్లాటు ఎక్కడ ఉందో సూచించేలా బోర్డులను ఏర్పాటు చేశారు. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన పట్టాలను వారంక్రితమే సిద్ధం చేశారు. ఈ పట్టాలపై తహసీల్దార్‌తో సంతకాలు చేయించి అందుబాటులో పెట్టారు. వీరందరికీ ఇళ్లు కూడా కట్టించి ఇచ్చేందుకు వాటిని స్కాన్ చేసి ఆ వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపారు. టౌన్‌ప్లానింగ్ నిబంధనలకు అనుగుణంగా లేఅవుట్లలో ఉండాల్సిన ఓపెన్ స్పేస్, రోడ్లు, డ్రెయిన్లు, పార్కింగ్, ఇతర అవసరాలకు కావాల్సిన భూమిని వదిలారు. ప్రతి లేఅవుట్‌ను డెప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి నేతృత్వంలో యుద్ధప్రాతిపదికన సిద్ధం చేశారు. ప్రతిరోజూ కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పనులను స్వయంగా పర్యవేక్షించారు.

జగనన్న మా కల నిజం చేశారు



కొన్నేళ్లుగా అద్దె ఇంటిలో ఉంటున్నాం. ఇన్నేళ్లకు జగనన్న సొంత ఇంటి కలను నిజం చేశారు. వెంకటపాలెంలో పట్టా అందుకోనుండడం ఆనందంగా ఉంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– బిరుదగడ్డ మేరీ, మంగళగిరి

ఇల్లు కట్టుకుంటాం



మాది తూర్పుగోదావరి జిల్లా. అక్కడ పనులు లేక మేము పుట్టక ముందే మా నాన్న, అమ్మ ఇక్కడకు వలస వచ్చారు. మేము ముగ్గురం ఆడపిల్లలం. కుటుంబాన్ని పోషించడమే కష్టంగా ఉండేది. నా పెళ్లి అయిన అనంతరం నా భర్తతో కలసి ఇక్కడే ఉంటున్నాం. నా భర్త ఇస్త్రీ బండి నిర్వహిస్తుంటారు. వచ్చే డబ్బులన్నీ ఇంటి అద్దెకు, కుటుంబ ఖర్చులకే సరిపోతున్నాయి. జగనన్న స్థలం ఇచ్చారు. ఎంతో ఆనందంగా ఉంది. వెంటనే అక్కడ ఇల్లు కట్టుకుంటాం.

– కలిదిండి కృష్ణవేణి, ఉండవల్లి



వెంకటపాలెంలో సీఎం సభావేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు విడదల రజని, జోగి రమేష్, మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీలు తలశిల, లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేత డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు



వెంకటపాలెం టీటీడీ దేవస్థానంలో చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ పూజలు చేస్తున్న ఎంపీ నందిగం సురేష్, కత్తెర సురేష్‌కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి తదితరులు

రుణపడి ఉంటాం



పేదల సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మా లాంటి పేదలు ఎంతో రుణపడి ఉంటారు. ఇళ్ల స్థలం కోసం నిరీక్షిస్తున్న తరుణంలో జగనన్న వరం ఇచ్చారు. ఇంటి స్థలం కేటాయించడం ఆనందంగా ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఇళ్లు ఇస్తామని నమ్మించి మోసం చేశారు.

– వద్దేశ్వరపు ఉషారాణి, మంగళగిరి

జగనన్న మేలు మరువలేం



నా భర్తది తాడేపల్లిలోని సంజీవ నగర్. నా పెళ్లయినప్పటి నుంచి అద్దె ఇంట్లోనే నివాసముంటున్నాం. మాది ఒకటే గది. పిల్లలు పెద్ద అవడంతో వేరే ఇంటికి అద్దెకు వెళ్లాం. నెలకు 6,000. కూలి పనులు చేసుకునే మాకు అంత అద్దె చెల్లించడం చాలా కష్టంగా ఉంది. ప్రభుత్వం స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించుకునేందుకు 1,80,000 అందించడంతో పాటు సబ్సిడీపై ఇసుక, ఇటుక ఇతర నిర్మాణ సామగ్రిని అందిస్తారని తెలిసింది. వెంటనే ఇళ్లు కట్టుకుని అక్కడకు వెళ్లిపోతాం. జగనన్న మేలు మరువలేం

– వేముల పవిత్ర, తాడేపల్లి

ఇంటి స్థలం జగనన్న పుణ్యమే




నా భర్త లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఎంతో ఇబ్బంది పడుతున్నాం. మా అమ్మానాన్న నిర్మించుకున్న ఒక గదిలోనే నా ఇద్దరు పిల్లలతో, నా తమ్ముడు చెల్లితో నివాసముంటున్నాం. జగనన్న పుణ్యమా అంటూ మాకు స్థలం ఇచ్చారు. అక్కడ ఇల్లు నిర్మించుకుంటాం. పిల్లల్ని పోషించుకునేందుకు తాపీ పని చేస్తున్నాను. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత మా పిల్లలకు అమ్మ ఒడి రావడంతో చదువులకు ఇబ్బంది లేకుండా పోయింది.

– చిల్లా మధురవాణి, తాడేపల్లి

దినజన ప్రవర్ధమానం

- 10 లక్షల జనాభాకు చేరువలో గుంటూరు
- రాష్ట్రంలో మూడోస్థానం
- అభివృద్ధి, మౌలిక వసతులు కల్పనలోనూ భేష్
- సిటిజన్ పర్సెప్షన్ సర్వేలో రాష్ట్ర స్థాయిలో 1వ స్థానం
- జాతీయ స్థాయిలో 6 స్థానం
- గ్రేటర్ మున్సిపాలిటీలకు దీటుగా వృద్ధి



నగర ఏరియల్ వ్యూ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరం 10 లక్షల జనాభాకు చేరువకు దగ్గరలో ఉంది. ప్రజలకు మౌలిక వసతులు కల్పన, నగర పురోభివృద్ధిలో నగరపాలకసంస్థ మంచి పనితీరు కనబరుస్తోంది. ఇటీవల కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ రాష్ట్ర వ్యాప్తంగా అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపల్ కార్పొరేషన్స్)పై నిర్వహించిన సర్వేలో గుంటూరు 9,81,276 మంది జనాభాతో గ్రేటర్ విశాఖపట్నం, విజయవాడ తరువాత మూడో స్థానంలో నిలిచింది.

ఇదీ గుంటూరు చరిత్ర

1866లో గుంటూరు మున్సిపాలిటీ ఏర్పాటైంది. 1881లో మున్సిపాలిటీ పాలకవర్గం ఏర్పడింది. 1891లో గ్రేడ్–2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. 1917లో గ్రేడ్–1 మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. 1994లో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ స్థాయికి ఎదిగింది. 2011 లెక్కల ప్రకారం గుంటూరు జనాభా 7,43,354 మంది. 2012లో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చుట్టూ ఉన్న 10 గ్రామాలు (ఏటుకూరు, బుడంపాడు, నల్లపాడు, అంకిరెడ్డిపాలెం, అడవితక్కెళ్లపాడు, గోరంట్ల, పొత్తూరు, చౌడవరం, రెడ్డిపాలెం, పెదపలకలూరు) విలీనమయ్యాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సమూలమార్పులు

రాష్ట్రం విడిపోయిన తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ గుంటూరు నగర అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. దీంతోపాటు యూజీడీ పేరుతో బాగున్న రోడ్లను తవ్వేసింది. గుంటూరును గుంటలూరుగా మార్చేసింది. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడంతోపాటు 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో గెలుపొంది మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడంతో గుంటూరుకు మహర్దశ పట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రోడ్లు విస్తరణ పనులను నగరపాలకసంస్థ చేపట్టింది. కొత్తగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించింది. ఆర్‌యూబీ, ఆర్వోబీ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపింది. గుంటూరులో పార్కుల అభివృద్ధికి నడుంబిగించింది. గుంటూరును రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందేందుకు ప్రజాప్రతినిధులు సహకారంతో నగరపాలక సంస్థ కృషి చేస్తోంది.

జాతీయస్థాయిలో గుంటూరు కీర్తి

కొద్ది నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సిటిజన్ పర్సెప్షన్ సర్వేలో గుంటూరు నగరపాలక సంస్థ జాతీయ స్థాయిలో 6వ స్థానంలో నిలిచింది. మౌలిక వసతుల కల్పన, విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో ప్రగతి తదితర అంశాలపై నిర్వహించిన సర్వేలో గుంటూరు తన కీర్తిపతాకను రెపరెపలాడించింది. ఈ సర్వేలో రాష్ట్రస్థాయిలో గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లయిన విశాఖపట్నం, విజయవాడలను సైతం పక్కకునెట్టి మొదటి స్థానంలో నిలిచింది.

గుంటూరుకు పెరుగుతున్న వలసలు

గతంలో గుంటూరులో నివాసానికి ప్రజలు భయపడేవారు. తాగునీరు దొరకదని భావించేవారు. ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. వేసవిలోనూ మంచినీరు పుష్కలంగా సరఫరా అవుతోంది. దీంతో గుంటూరుకు వలసలు పెరుగుతున్నాయని, స్థానికంగా నివాసం ఉండడానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారని అధికారులు చెబుతున్నారు.

ఖరీఫ్.. ప్రొసీడ్'

- పంటల ప్రణాళిక ఖరారు
- సన్నద్ధం అవుతున్న రైతులు
- విత్తనాలు, ఎరువులు సిద్ధం
- ఆర్‌బీకేలకు చేరిన పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు



గుంటూరులోని ఏపీ సీడ్స్ గోడౌన్‌లో సిద్ధంగా ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: సేద్యానికి ప్రభుత్వం దన్నుగా నిలుస్తోంది. రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించడంతోపాటు ఆర్‌బీకేల ద్వారా సాగు ఉత్పాదకాలు అందిస్తోంది. కర్షకులకు అడుగడుగునా తోడుగా నిలబడుతోంది. విత్తనం మొదలు పంట దిగుబడుల విక్రయం వరకు రైతుకు ఏ ఇబ్బందీ లేకుండా అన్నిరకాలుగా చేయూతనిస్తోంది. త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ పంటల ప్రణాళికను వ్యవసాయ శాఖ ఇప్పటికే సిద్ధం చేసింది. విత్తనాలు, ఎరువులను ముందస్తుగా కేటాయించింది. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలను 50శాతం సబ్సిడీపై ఆర్‌బీకేల ద్వారా అందిస్తోంది. ఫలితంగా రైతులు సేద్యానికి ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు.

చిరుధాన్యాల సాగుకు పెద్దపీట..

ఖరీఫ్‌లో చిరుధాన్యాల సాగుకు పెద్దపీట వేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 2023వ సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించింది.ఈ నేపథ్యంలో ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేసి చిరుధాన్యాల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

29,500 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం

ఖరీఫ్ విత్తనాలను సకాలంలో అందించేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ ప్రక్రియ చేపట్టింది. ఇప్పటికే వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్లు జోరందుకున్నాయి. ఈనెల చివరి లోగా విత్తన పంపిణీకి అధికారులు శ్రీకారం చుట్టనున్నారు. జూన్ మాసంలో వర్షాలు పడగానే విత్తుకునేందుకు ఇబ్బంది లేకుండా రైతు చెంతకు విత్తనాలను చేర్చనున్నట్లు చెబుతున్నారు. గుంటూరు జిల్లాకు 1,700 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు, 29,500 క్వింటాళ్ల వరి, 37.35 క్వింటాళ్ల పెసర, 547 క్వింటాళ్ల మినుము, 1,087.75 క్వింటాళ్ల ప్రత్తి విత్తనాలు, 39.77 క్వింటాళ్ల మిరప విత్తనాలు అవసరమని అధికారులు నిర్ధారించారు. ఇందులో 20 శాతం విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

2023లో సాగు విస్తీర్ణం అంచనా ఇలా..

పంట	విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి	66,478
పత్తి	30,563
మిరప	22,361
మినుము	2,249
పసుపు	1,985
ఇతర పంటలు	10,962
మొత్తం	1,34,598

97,006 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం

ఖరీఫ్ సీజన్‌లో జిల్లాకు 97,006 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అధికారులు గుర్తించారు. ఈ మేరకు కేటాయింపులూ జరిపారు. 39,850 మెట్రిక్ టన్నుల యూరియా, 19,208 మెట్రిక్ టన్నుల డీఏపీ, 29,776 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 3,194 మెట్రిక్ టన్నుల పొటాష్, 4,978 మెట్రిక్ టన్నుల సూపర్ పాస్ఫేట్(ఎస్‌పీ)లను ప్రభుత్వం కేటాయించింది. వీటినీ రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచనున్నారు. ఇప్పటికే జిల్లాలో 28,216.85 మెట్రిక్ టన్నుల ఎరువులు ఆర్‌బీకేలు, మార్క్‌ఫెడ్, టోకు వర్తకులు, చిల్లర వర్తకులు, సహకార సంఘాలలో అందుబాటులో ఉన్నాయి. ఇందులో 10,537.45 మెట్రిక్ టన్నుల యూరియా, 5,310.10 మెట్రిక్ టన్నుల డీఏపీ, 12,130 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 239.30 మెట్రిక్ టన్నుల పొటాష్ ఉన్నాయి.

ఖరీఫ్‌కు సర్వంసిద్ధం



ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయ శాఖ సర్వసన్నద్ధంగా ఉంది. రైతులకు ఎరువులు, విత్తనాలు పుష్కలంగా అందిస్తాం. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలను ఆర్‌బీకేల్లో 50 శాతం రాయితీతో ఇస్తున్నాం. విత్తనాలు, ఎరువులకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చర్యలు చేపట్టాం.

– నున్నా వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి, గుంటూరు

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ వెంకట్రావు

తెనాలిరూరల్: విద్యార్థులు, యువత లక్ష్యంగా గంజాయి విక్రయిస్తున్న ఇరువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని కొలవరం గ్రామానికి చెందిన ఆళ్ల దామోదర్‌రెడ్డి అలియాస్ వైఎస్ విజయవాడకు చెందిన తనకు పరిచయస్తుడు నవీన్ అలియాస్ పుష్ప నుంచి గంజాయి కొనుగోలు చేసి తెచ్చి విక్రయిస్తున్నాడు. 50, 100 గ్రాముల ప్యాకెట్లుగా చేసి విద్యార్థులు, యువతకు విక్రయాలు జరుపుతున్నాడు. అతని వద్ద నుంచి పెద్ద మొత్తంలో గంజాయి కొనుగోలు చేసేందుకు దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామానికి చెందిన ఏమినేని లక్ష్మీనారాయణ బుధవారం రాత్రి తెనాలి మండలం నందివెలుగు ప్రధాన జంక్షన్‌లోని బస్టాప్ వద్దకు వచ్చి దామోదర్ రెడ్డిని కలిశాడు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ కె.శ్రీనివాసరెడ్డి, రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుళ్లు చలమేశ్వర రావు, మణికుమార్, కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, రాము నందివెలుగు జంక్షన్‌కు వెళ్లి ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ వాసి నవీన్ విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తెచ్చి విక్రయాలు జరుపుతున్నట్టు తమ దర్యాప్తులో వెల్లడైందని, అతన్ని అదుపులోకి తీసుకుని ఏజెన్సీలో గంజాయి విక్రయించిన వారి వివరాలను సేకరించాల్సి ఉందని ఎస్‌ఐ తెలిపారు. సమావేశంలో ఏఎస్‌ఐ తోటకూర భీమశంకరరావు, సిబ్బంది ఉన్నారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు


సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బరాజు

గుంటూరు మెడికల్: స్కానింగ్ కేంద్రాల్లో ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి గర్భస్థ లింగ నిర్ధారణ జరిపినట్లు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని పీసీపీఎన్‌డీటీ జిల్లా నోడల్ అధికారి కె.వి.సుబ్బరాజు హెచ్చరించారు. గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గురువారం జిల్లా అడ్వైజరీ కమిటీ సంయుక్త సమావేశం జరిగింది. సమావేశంలో డాక్టర్ సుబ్బరాజు మాట్లాడుతూ గుంటూరు డివిజన్ పరిధిలో 210 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. స్కానింగ్ కేంద్రాల వద్ద లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరం, లింగనిర్ధారణ పరీక్షలు చేయరు, లింగనిర్ధారణ అడిగితే శిక్షార్హులని బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. స్కానింగ్ కోసం వచ్చే గర్భిణుల వివరాలు నమోదు చేసుకోవాలని, అధిక ఫీజు వసూలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రామోహన్‌రావు, డాక్టర్ నస్రీన్, డాక్టర్ పవనకుమారి, రామ్‌కుమార్, అనిత, రాణి, చంద్రశేఖర్, జయప్రసాద్, అరుణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అత్యవసర వైద్య సేవలకు ప్రాధాన్యం

- త్వరితగతిన అందేలా చర్యలు
- సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు బలోపేతం చేస్తాం
- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్


డాక్టర్ నీలం ప్రభావతి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అత్యవసర వైద్య సేవల విభాగానికి చికిత్స కోసం వచ్చే రోగులకు, రోడ్డు ప్రమాద బాధితులకు సత్వరమే వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం సూపరింటెండెంట్‌గా ఆయన బాధ్యతలు చేపట్టి మీడియాతో మాట్లాడారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా వెళ్లిన డాక్టర్ నీలం ప్రభావతి నుంచి డాక్టర్ కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆసుపత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీలు, కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు, కాక్లియర్ ఆపరేషన్లు జరిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర వైద్య సేవల విభాగంలో డీఏపీ, డీఏఎస్‌లు విధుల్లో అలర్ట్‌గా ఉండి బాధితులకు సత్వరం వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యశ్రీ ఆపరేషన్లు ఎక్కువగా జీజీహెచ్‌లో జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఐసీయూ, వెంటిలేటర్ చికిత్స అందించే వైద్య విభాగాల్లో సిబ్బంది పనితీరులో మార్పు తీసుకొచ్చి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం, జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాల ద్వారా జీజీహెచ్‌లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచి ఆసుపత్రికి కొత్త శోభ తీసుకొస్తామన్నారు. శానిటరీ, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ పెంచి ఆసుపత్రిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యులు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండేలా, ఇతర వైద్య సిబ్బంది సైతం తమకు నిర్దేశించిన పనివేళల్లో ఆసుపత్రిలో ఉండి రోగులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్య విద్య బలోపేతానికి కృషి

ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభావతి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నీలం ప్రభావతి గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను అడిషనల్ డీఎంఈ కేడర్‌లో పదోన్నతిపై వైద్య కళాశాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డాక్టర్ ప్రభావతి మీడియాతో మాట్లాడుతూ వైద్య కళాశాలలో పీజీలకు మెరుగైన బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

సీఎంఏ ఫలితాల్లో సత్తాచాటిన మాస్టర్ మైండ్స్ విద్యార్థులు


లక్ష్మీప్రసన్న

నగరంపాలెం: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ ఎకౌంట్స్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన పరీక్షల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులైన టి.దీక్షిత్‌కు సీఎంఏ ఫౌండేషన్‌లో ఆల్ ఇండియా రెండో ర్యాంక్, లక్ష్మీప్రసన్నకు సీఎంఏ ఫౌండేషన్‌లో ఆల్ ఇండియా 3వ ర్యాంకు సాధించారు. ఈ మేరకు విద్యార్థులకు ప్రధాన కార్యాలయం (కలకత్తా)కు రావాలని లెటర్స్ పంపించారు. ఈనెల 28న వారిని ఘనంగా సత్కరించనున్నారు. ఈ సందర్భంగా మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ ఆల్ ఇండియా ర్యాంకులు రావడం మాస్టర్ మైండ్స్‌కి కొత్తేమి కాదన్నారు. ఈ ర్యాంకుల వెనుక విద్యార్థులు, సిబ్బంది కృషి ఉన్నదని ఆయన వివరించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఎమ్మెల్యే సాయం


కానిస్టేబుల్ పవన్ కుమార్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: రాజధాని ప్రాంతంలోని ఆర్-5 జోన్‌లో భద్రతా విధులు నిర్వహిస్తూ పాముకాటుకు గురై మృతి చెందిన ప్రకాశం జిల్లా తాళ్లూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ పవన్ కుమార్ భౌతిక కాయాన్ని గురువారం మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) గుంటూరు నగరంలోని జీజీహెచ్‌లో సందర్శించి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపి రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గౌరవ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మృతుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉండేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.

వేలిముద్రలు సరిపోకుంటే 'ఐరిస్'తో రేషను పంపిణీ

- జూన్ నుంచి ఆరంభం
- జిల్లా పౌరసరఫరాల అధికారి చల్లా లక్ష్మీనారాయణరెడ్డి


ఐరిస్ పరికరాలను పంపిణీ చేస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి

తెనాలి: జిల్లాలో రేషను బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాలకు ఐరిస్ మిషను అందచేస్తున్నట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి చల్లా లక్ష్మీనారాయణరెడ్డి వెల్లడించారు. నెలాఖారులోగా వీటిని అందించి, జూన్ నెలనుంచి వేలిముద్రలతోపాటు ఐరిస్ ఆధారిత ధ్రువీకరణను ప్రామాణికంగా తీసుకుని నిత్యావసరాలు, బియ్యం పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన సభలో తెనాలి, పొన్నూరు, మంగళగిరి, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని ఎండీయూ ఆపరేట్లకు ఐరిష్ మిషన్లను పంపిణీ చేశారు. ఐరిస్‌తో నిత్యావసరాలు, బియ్యం పంపిణీపై వారికి అవగాహన కల్పించారు. లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ, ఎండీయూ వాహనాలతో జరుగుతున్న పంపిణీలో అలసత్వం, అక్రమాలకు చోటులేకుండా గత డిసెంబరు నుంచి ఎండీయూ వాహనాలకు జీపీఎస్ ట్రాకర్లు అమర్చి పంపిణీ చేస్తున్నట్టు గుర్తుశారు. దీంతోపాటు రేషను పంపిణీ విధానంలో మరో మార్పునకు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ఇప్పటి వరకు తెల్లరేషను కార్డు ఉన్న లబ్ధిదారులకు బయోమెట్రిక్ (వేలిముద్రలు) ఆధారంగా రేషను పంపిణీ జరుగుతోంది. అయితే కొంత మంది 60 పైబడిన వారిలో వేలిముద్రలు ఈ-పోస్ మిషనులో సరిపోకపోవటంతో నెలనెలా రేషను పంపిణీలో సమస్య ఎదురవుతున్నట్టు గుర్తుచేశారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం తక్షణ చర్యలకు ఉపక్రమించిందని చెప్పారు. రేషను పంపిణీకి అనుసరిస్తున్న వేలిముద్రల స్థానంలో ఐరిస్ (కంటి గుర్తింపు) విధానాన్ని అమల్లోకి తెచ్చినట్టు లక్ష్మీనారాయణరెడ్డి చెప్పారు. ఇందుకు సంబంధించి పౌరసరఫరాలశాఖకు స్పష్టమైన ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. ఐరిస్ మిషన్ల వినియోగంపై ఎండీయూ ఆపరేటర్లకు శిక్షణనిచ్చి, ఆయా మిషన్లను వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీలు జేవీఎస్ఎన్ మూర్తి, దుర్గారావు, భువనేశ్వరి, పద్మ, ఆపరేటర్లు పాల్గొన్నారు.


సేవావజ్ర అవార్డులు ప్రదానం చేసిన మంత్రి రజిని

వలంటీర్లు సేవా సైనికులు

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- అట్టహాసంగా వలంటీర్లకు వందనం కార్యక్రమం

యడ్లపాడు: గ్రామ వలంటీర్లు జగనన్న సేవా సైనికులు, సంక్షేమ వారధులని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అభివర్ణించారు. యడ్లపాడులోని టీటీడీ కల్యాణ మండపంలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి రజిని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన సచివాలయాలు, వాటికి అనుబంధంగా నెలకొల్పిన వలంటీర్ వ్యవస్థ చక్కని సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. అర్హులను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా అందించడంలో ప్రభుత్వానికి, లబ్ధిదారులకు మధ్య వలంటీర్ వ్యవస్థ వారధిగా నిలుస్తోందని పేర్కొన్నారు. పథకాల లబ్ధి కలిగించడం, స్థానికంగా ఉన్న సామాజిక, వ్యక్తిగత సమస్యల్ని గుర్తించి అర్హులతో దరఖాస్తు చేయించడం వంటి పనుల్లో వలంటీర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు అందించిన సేవలు నిరుపమానమని ప్రశంసించారు. అందుకే వారి సేవలకు గుర్తుగా ఇప్పటికే మూడుసార్లు ప్రభుత్వం అవార్డులు అందించిందని, నాలుగో ఏడాదీ యడ్లపాడు మండలంలో ఏడుగురికి ఈ అవార్డులు అందిస్తున్నట్లు వివరించారు.

ఎంపీడీవో వై హనుమారెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్ ఎం.వీరారెడ్డి, ఎంపీపీ పి.ఝాన్సీ, సర్పంచ్ కె. హేమ, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గంటా శంకర్, రాచమంటి చింతారావు, మాదం శ్రీను, కర్నాట సుబ్బారావు, కల్లూరి హరిబాబు, గౌరు హనుమంతరావు, ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, గౌస్‌సందాని, వడ్డేపల్లి నర్సింహారావు, ఎంవీ సుబ్బారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు గ్రహీతలు వీరే...

సేవావజ్ర అవార్డులను యాతం వెంకటేశ్వర్లు(లింగారావుపాలెం), మేడా కృష్ణవేణి (ఉన్నవ), సేవారత్న అవార్డుల్ని ఒంటిపుల్ల నాగేంద్రవర్మ (తిమ్మాపురం), ఇగిటిల ప్రియాంక (ఉన్నవ), మీర్జా షహీన (యడ్లపాడు-1), కుంభా శ్యామ్యేల్ (యడ్లపాడు-2), అన్నపరెడ్డి భాగ్యలక్ష్మి (సొలస) అందుకున్నారు. వీరికి శాలువా కప్పి ప్రశంసాపత్రం, పతకంతోపాటు సేవావజ్రకు రూ.30వేలు, సేవారత్నకు రూ.20వేలు నగదు బహుమతుల్ని మంత్రి అందజేశారు.